కేజీబీవీలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఇన్‌చార్జి డీఈవో చావా శ్రీనివాసరావు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 13 : సమ్మె నేపథ్యంలో కేజీబీవీలలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జి డీఈవో చావా శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం కేజీబీవీలను శుక్రవారం ఆయన సీఎం రాజశేఖర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనా సిబ్బంది సమ్మెలో ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు కేజీబీవీల సమీపంలోని ఉన్నత పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను కేజీబీవీలకు రొటేషన్ పద్ధతిపై పంపినట్లు తెలిపారు. అలాగే విద్యార్థినులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ కేజీబీవీలలో బియ్యం నిల్వలు అయిపోవడంతో వెంటనే పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి.. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఇన్‌చార్జి డీఈవో వెంట ఎంఈవోలు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు నయాబజార్ విద్యార్థి

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 13 : ఖమ్మం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి గోపినాథ్ ఈ నెల 22 నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కేఎస్ రామారావు తెలిపారు. అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించేందుకు కృషి చేశాడన్నారు.

బేస్‌బాల్‌లో ఉమెన్స్ కాలేజీ విద్యార్థినుల ఎంపిక

నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న స్రవంతి, కళ్యాణి రాజస్థాన్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి జరిగే బేస్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థునులకు రూ.2 వేలు బహుమతిగా అందించారు.

కరాటేలో డీపీఎస్‌కు బంగారు పతకాలు

విద్యార్థులతో ప్రిన్సిపాల్ నిధిరాజ్‌గుప్తా

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 13 : ఖమ్మం నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ కడారి రవీందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం పుత్తూర్‌లో జరిగిన నేషనల్ బుడోకాన్ 42వ కరాటే పోటీల్లో డీపీఎస్ విద్యార్థులు ఎన్నో పతకాలు సాధించారన్నారు. పాఠశాలకు చెందిన దీక్షిత, యువనీత్‌రెడ్డి గోల్డ్‌మెడల్స్, తన్వి, సంధ్య, సిద్ధుశ్రీ, శ్రేష్ఠ, హాన్వికలు సిల్వర్, యామిని, హాఫ్సా, సాయిప్రసన్నయ్యలు బ్రాంజ్‌మెడల్స్ గెలుచుకున్నారన్నారు. విద్యార్థులు, కరాటే టీచర్స్ సాయిరేఖ, సాయికిరణ్‌ను ప్రిన్సిపాల్ నిధిరాజ్‌గుప్తా, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్లూమింగ్‌మైండ్స్‌లో కలర్ వేడుకలు

వైలెట్ కలర్ దుస్తుల్లో చిన్నారులు, ఉపాధ్యాయులు

రఘునాథపాలెం, డిసెంబర్ 13 : ఖమ్మం నగరం బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్‌లో ఉదా రంగు వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వైలెట్ కలర్ దుస్తులను ధరించి ఆకట్టుకున్నారు. ఉదా రంగు విశిష్టతను కరస్పాండెంట్ పీ అశోక్‌రెడ్డి వివరించారు. ధ్యానం సమయంలో మన చుట్టూ ఉదా రంగు వస్తువులు కనిపించేలా ఉంటే ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు సంకెళ్లు వేయడంపై నిరసన

నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

వైరాటౌన్, డిసెంబర్ 13 : లగచర్ల ఫార్మా కంపెనీల భూ పోరాటంలో జైలులో ఉన్న రైతు హీర్యానాయక్‌కు సంకెళ్లు వేసి ఆసుపత్రికి తరలించడాన్ని నిరసిస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా పట్టణంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతుల చేతులకు సంకెళ్లు వేసి దేశద్రోహిలా తరలించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం వైరా పట్టణ అధ్యక్షుడు మల్లెంపాటి రామారావు, జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం నాయకులు యనమద్ది రామకృష్ణ, పల్లెబోయిన కృష్ణ, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు.
జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పార్కులను తనిఖీ చేసిన మేయర్

ఖమ్మం, డిసెంబర్ 13 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 28, 29వ డివిజన్లలో పార్కులను ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు హాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్ పరిధిలో ఉన్న వర్కర్‌లకు సమయానికి జీతాలను ఇప్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన కోటు, బూట్లు వేసుకుంటున్నారా లేదా అని జవాన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉదయం పార్కులకు వచ్చే వాకర్స్‌ను పార్కులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్లు లక్ష్మి, హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక, టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి పాల్గొన్నారు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

వీడిన దంపతుల హత్య కేసు మిస్టరీ

- ఛేదించిన పోలీసులు.. ఎనిమిది మంది అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీపీ సునీల్‌దత్

వివరాలు వెల్లడిస్తున్న సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, డిసెంబర్ 13 : నేలకొండపల్లి మండల కేంద్రంలో జరిగిన దంపతుల హత్య కేసు మిస్టరీని ఛేదించినట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డితో కలిసి హత్య కేసు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మొలుగూరు గ్రామానికి చెందిన షేక్ అబీద్ అలియాస్ అబీద్‌ఆలీ అలియాస్ సోహైల్ అలియాస్ ఆరిఫ్(36) అనే వ్యక్తి 2011లో ఓ వ్యక్తిని హత్య చేయగా 2014లో నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. రాజమండ్రి సెంటర్ జైల్‌లో ఉన్న నిందితుడు 2020లో పెరోల్‌పై వచ్చి గడువు ముసినప్పటికీ జైలుకు వెళ్లకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. కొందరు వ్యక్తులతో కలిసి ముఠాగా ఏర్పాటు చేసుకుని జల్సాలకు అలవాటుపడిన నిందితులు దోపిడీలు, దొంగతనాలు చేస్తూ తప్పించుకుని తిరుగుతున్నారు. వారిని ప్రకాష్‌నగర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానితులుగా భావించి అరెస్టు చేసిన వారిలో నేలకొండపల్లి మండలంలో జరిగిన హత్య నేరస్తులుగా గుర్తించారు. ఈ ప్రధాన నిందితుడితోపాటు కోదాడకు చెందిన షేక్ హుస్సేన్‌బీ, చిలూకూరు మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన చిట్టిపోలు సురేష్, ఖమ్మం నగరానికి చెందిన ఫరీద్ అహ్మద్, నేలకొండపల్లి మండలం బుద్దారం గ్రామానికి చెందిన జమాల్‌బీ, షబీనాలు ముఠాగా ఏర్పడ్డారు. ప్రధాన నిందితుడు జమాల్ బీ సమాచారం మేరకు మండల కేంద్రంలో వెంకటరమణ అనే వ్యక్తి దగ్గర డబ్బులు బాగా ఉన్నాయని, పీడీఎస్ బియ్యం విక్రయాలు చేసి బాగా సంపాదించాడనే సమాచారం తెలుసుకున్న నిందితుడు పథకం ప్రకారం ఇంట్లో రూములు కిరాయికి ఇస్తారనే ముందస్తు సమాచారం తెలుసుకుని ఇళ్లు కావాలని దంపతులను సంప్రదించారు. దీంతో వారి మాటలు నమ్మిన దంపతులు ఇల్లు కిరాయికి ఇచ్చేశారు. ఇంట్లో కిరాయికి దిగిన వారు దంపతుల ఇద్దరితో మంచిగా మాట్లాడుతూ వారి ఇంట్లోనే టీవీ చూస్తూ నమ్మించారు. వారు ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారం నవంబర్ 25వ తేదీన రాత్రి ఇంట్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. కానీ కుదరకపోవడంతో తిరగి 26వ తేదీన ప్రణాళికను అమలు చేశారు. వెంకటరమణ భార్య క్రిష్ణకుమారి టీవీ చూస్తుండగా మాటల్లో పెట్టగా ఒక్కసారిగా పక్క గదిలోనే కాపుకాసి ఉన్న సురేష్, అబీద్‌లు వెనుక నుంచి వచ్చి రూంలోకి దూరి ముందుగా క్రిష్ణకుమారి నోరు మూసి సోఫాలో పడేసి గొంతు నులిమి చంపేశారు. అనంతరం ఆమె ఒంటి మీద ఉన్న బంగారం దోచుకొని పక్క రూంలో వెతుకుతుండగా నిద్రిస్తున్న భర్త వెంకటరమణ లేచి వీరిని చూడగా అతన్ని కూడా నోరు మూసి గొంతు నులిమి చంపేశారు. అనంతరం పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఇంటి పరిసరాల్లో కారం చల్లి అక్కడి నుంచి బంగారం తీసుకుని తిరిగి పారిపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితులు నలుగురుతోపాటు వారికి సహకారం అందించిన ఖమ్మం నగరానికి చెందిన సిమ్‌లు అమ్ముకునే మణికంఠతోపాటు మరో ముగ్గురు నిందితులను ఈ కేసులో అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, 8 తులాల బంగారం, ద్విచక్రవాహనం స్వాధీన చేసుకున్నారు. ఈ సమావేశంలో కుసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐలు సంతోష్, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మిస్తాం..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, డిసెంబర్ 13 : రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచిలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధ్యక్షతన శుక్రవారం తొలిసారిగా ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి సీపీ సునీల్‌దత్‌తో కలిసి మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ యాప్ ద్వారా పారదర్శకంగా సర్వే చేపడుతున్నామని, అది ఈ నెలాఖరు వరకు పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మార్కెట్ చైర్మన్ సీతారాములు, ఆర్డీవో నర్సింహారావు, డీఎం శ్రీలత, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎస్ఈ వెంకటరెడ్డి, హౌసింగ్ పీడీ, సీఐ మురళి, తహసీల్దార్ కరుణశ్రీ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం/ ఖమ్మంరూరల్, డిసెంబర్ 13: తిరుమలాయపాలెం మండలంలోని కొక్కెరేణి, బీరోలు, బచ్చోడు, హస్నాబాద్, సుబ్లేడు, పాతర్లపాడు గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణాలకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఖమ్మంరూరల్ మండలం ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్ కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.

నివాళి అర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు

పార్లమెంట్ సిబ్బందికి నివాళి

ఖమ్మం, డిసెంబర్ 13 : పార్లమెంట్‌పై 2001 డిసెంబర్ 13న తీవ్రవాదులు జరిపిన దాడిలో మృతిచెందిన భద్రతా సిబ్బందికి శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాళి అర్పించారు. పార్లమెంట్ ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారి త్యాగాలను ఈ సందర్భంగా కొనియాడారు.

తాళ్లూరి పంచాక్షరయ్యను కలిసిన ఎమ్మెల్సీ తాతా మధు

తాళ్లూరిని కలిసిన తాతా మధు

ఖమ్మం, డిసెంబర్ 13 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో తాళ్లూరి చారిటబుల్ ట్రస్టు చైర్మన్, గ్రామపెద్ద తాళ్లూరి పంచాక్షరయ్యను శుక్రవారం బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యోగక్షేమాలు అడిగి తెలుసుకుని తాజా రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు ముచ్చటించారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకుడు బెల్లం వేణుగోపాల్, మల్లెల రవిచంద్ర, వంశీకృష్ణ, రామ కొండారెడ్డి, జగదీష్, శ్రీనివాస్ ఉన్నారు.

రేపు రైతులకు అవగాహన సదస్సు

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 13 : ఖమ్మం నగరంలోని ఈఆర్ఆర్(ఓయాసిస్) రిసార్టులో ఈ నెల 15వ తేదీ ఆదివారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు నల్లమల వెంకటేశ్వర రావు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఈఆర్ఆర్ రిసార్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతుసంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. 2025 ఫిబ్రవరిలో పదిరోజులపాటు హైదరాబాద్‌లో సుభాష్ పాలేకర్ కృషి విధానంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా 15న జిల్లాస్థాయిలో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో నాగేశ్వరరావు, వెంకటరామి రెడ్డి, మాధవి, సైదుబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 13 : విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు కొనసాగిస్తున్న సమ్మె దీక్షా శిబిరాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం సందర్శించారు. సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అసెంబ్లీలో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, వైవీ, డీవీ, నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ బాలికల హాస్టల్‌ను సందర్శించిన ఆర్డీవో

హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్, డిసెంబర్ 13: పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోగల ఎస్టీ బాలికల హాస్టల్‌ను ఆర్డీవో రాజేంద్రగౌడ్, సింగరేణి పీవో ప్రహ్లాద శుక్రవారం సందర్శించారు. హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. బాలికలతో భోజనం, వసతి, భద్రత గురించి తెలుసుకున్నారు. హాస్టల్ వార్డెన్‌కు శుభ్రతపై సూచనలు చేశారు. వారి వెంట డాక్టర్ మాట్టా దయానంద్ తదితరులు ఉన్నారు.

రైతుల ధాన్యం కొనాలి: సొసైటీ చైర్మన్

వైరారూరల్, డిసెంబర్ 13 : ఎంటీయూ 1262 రకం ధాన్యాన్ని ఎగుమతి చేసుకునేందుకు మిల్లర్లు అభ్యంతర తెలపడం సరికాదని, వెంటనే కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని పూసలపాడు సొసైటీ చైర్మన్ గాలి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంపై శుక్రవారం ఆయన మాట్లాడుతూ అధికారులు తక్షణమే స్పందించి పూసలపాడు, నారపనేనిపల్లి గ్రామంలోని ధాన్యం కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని కోరారు.

'సీతారామ' నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

వైరాటౌన్, డిసెంబర్ 13 : సీతారామ ప్రాజెక్టు నిర్వాసితులకు ఎకరానికి రూ.40 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కమిటీ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బోడేపూడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్ట్ కోసం సేకరించిన 560 ఎకరాలకు సంబంధించి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. డివిజన్ కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, తాళ్ళపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరరావు, కె.నరేంద్ర, చెరుకుమల్లి కుటుంబరావు, బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, దొడ్డపనేని కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

'పంటల అవశేషాలను కలియదున్నాలి'

బోనకల్లు, డిసెంబర్ 13: పంటల అవశేషాలను కాల్చవద్దని ఏడీఏ విజయ్‌చంద్ర.. రైతులకు సూచించారు. పొలాల్లోని పంటల అవశేషాలను నేలలోనే కలియదున్నడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. బోనకల్లు మండలం ముష్టికుంట్ల గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. ఆ గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. పంట అవశేషాలు కాల్చడం వల్ల కలిగే నష్టాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు పసునూరి విజయ్‌కుమార్, మరీదు త్రివేణి పాల్గొన్నారు.

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'

బోనకల్లు, డిసెంబర్ 13: రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులూ లేకుండా పంట రుణాలను మాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు రైతులతో కలిసి శుక్రవారం బోనకల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ ఎన్నికల ముందు ప్రకటించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన అనేక కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా 30 శాతం లోపు రుణమాఫీ కాని రైతులు ఉన్నారని అన్నారు. సంఘం నాయకులు గుంటూరి ఉమా, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేశ్ పాల్గొన్నారు.

'జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి'

బోనకల్లు, డిసెంబర్ 13: విద్యార్థులు జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని హెల్ప్ జిల్లా కోఆర్డినేటర్లు కరుణాకర్, మోహన్‌రావు సూచించారు. ఇంటర్ బోర్డు ఆదేశాలతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో 'హార్ట్‌ఫుల్‌నెస్ ఎక్స్‌పీరియన్స్ అండ్ లైఫ్ పొటెన్షియల్' పేరిట శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల సమయాల్లో ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఆలోచించి పుస్తక పఠనం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ నళినిశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు రామకృష్ణ, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

కూసుమంచి, డిసెంబర్ 13: కూసుమంచి మండలం పాలేరు, నాయకన్‌గూడెం, భగత్‌వీడు, ఈశ్వరమాధారం, మంగలితండా తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల విషయంలో ఎన్నికల సంఘం నిర్ణయం ప్రకటించిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని అన్నారు. ఎంపీవో రామచందర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు బహుమతి ప్రదానం

కొణిజర్ల, డిసెంబర్13 : తనికెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీడీవో రోజారాణి, ఎంఈవో అబ్రహం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ షేక్ రంజాన్ శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. పురుషుల ఖోఖోలో ప్రథమ పెద్దగోపతి, ద్వితీయ తనికెళ్ల, కబడ్డీలో ప్రథమ తనికెళ్ల, ద్వితీయ మేకాలకుంట, వాలీబాల్‌లో ప్రథమ పెద్దమునగాల, ద్వితీయ స్థానంలో కొణిజర్ల జట్టు నిలిచాయి. మహిళా విభాగంలో ఖోఖోలో ప్రథమ సింగరాయపాలెం, ద్వితీయ తనికెళ్ల, కబడ్డీలో ప్రథమ పెద్దమునగాల, ద్వితీయ తనికెళ్ల, వాలీబాల్‌లో ప్రథమ కొణిజర్ల, ద్వితీయ బహుమతి తనికెళ్ల గెలుచుకున్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కే.నరసింహారావు, నక్క వెంకటేశ్వర్లు, గుమ్మిదేళ్లి రాంబాబు, కే.గిరిబాబు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు, రేపు యూటీఎఫ్ జిల్లా మహాసభలు

పెనుబల్లి, డిసెంబర్ 13: ఆది, సోమవారాల్లో సత్తుపల్లిలో నిర్వహించనున్న యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీవీ రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం సత్తుపల్లిలో డివిజన్ కార్యాలయ ప్రారంభించిన అనంతరం కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి బాలికోన్నత పాఠశాలలో జరిగే సభాస్థలికి చేరుకుంటారన్నారు. సభలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏనర్సిరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

'కొండా'కు బీఆర్ఎస్ నాయకుల నివాళి

ఎర్రుపాలెం, డిసెంబర్ 13: ఎర్రుపాలెం గ్రామానికి చెందిన బట్టు కొండా అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు.. వెంటనే అతడి నివాసానికి చేరుకొని అతడి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు పంబి సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, రామకోటయ్య, భాస్కర్‌రెడ్డి, పవన్, మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

రైతులకు సంకెళ్లు వేయడం అమానుషం

ఎర్రుపాలెం, డిసెంబర్ 13: ఫార్మా కంపెనీ కోసం ప్రభుత్వం అక్రమ పద్ధతితో చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడిన లగచర్ల రైతులకు పోలీసులతో ప్రభుత్వం సంకెళ్లు వేయించడం అమానుషమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లగచర్ల పోరాటంలో అక్రమంగా అరెస్టయి జైలులో ఉన్న రైతు హీర్యానాయక్‌కు ఛాతి నొప్పి వస్తే సంకెళ్లతో అతడిని ఆసుపత్రి తీసుకెళ్లడం దారుణమన్నారు.

'కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారు'

తిరుమలాయపాలెం, డిసెంబర్ 13: మండలంలోని పలువురు అధికారులను అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని ఎంఎస్పీ మండల నాయకుడు చింతరాల నాగభూషణం, బీఆర్ఎస్ మండల నాయకుడ